క్లుప్తంగా

భీమిలి ఏఎంసీ కార్యవర్గం ఏడాది పొడిగింపు

తగరపువలస: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కార్యవర్గం పదవీకాలం మరో ఏడాది పొడిగించినట్టు ప్రస్తుత చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సిఫారసుతో ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని ఈ మేరకు ఫైల్‌ను వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పంపించారన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ బలోపేతానికి తమ కార్యవర్గం కృషి చేస్తుందన్నారు.

30న ఓడ ఊరేగింపు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట గ్రామ దేవత శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి ఓడ ఊరేగింపు మహోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం అమ్మవారి ఓడ ఊరేగింపు అనంతరం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

76 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం : మండలంలోని ముకుందపురంలో గురువారం నిర్వహించిన కుటుంబ డాక్టర్ విధానంలో 76 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ కలిమి గంగరాజు శిబిరాన్ని ప్రారంభించారు. భీమిలి వైద్యాధికారి దుర్గా కల్యాణి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న కోట్ల సన్యాసిరావు ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. వాడుతున్న మందులను పరిశీలించి వైద్య సలహాలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి సాంబమూర్తి, ఆరోగ్య కార్యకర్తలు మెట్ట దేవి, నాగేశ్వరరావు, సీహెచ్‌వో సర్వలత, దొంతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చంద్రంపాలెంలో చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం వద్ద వరహాలరావు సహాయ సహకారాలతో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో దాతలు కూడా ఈ విధంగా మజ్జిగ చలివేంద్రం నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తుండడం అభినందనీయమని కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, పిళ్లా వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, కొప్పల వెంకట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ సిబ్బందికి నూనె పంపిణీ



శానిటరీ సిబ్బందితో కార్పొరేటర్ లొడగల అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో విధులు నిర్వహిస్తున్న శానిటరీ సిబ్బందికి గురువారం సాగర్‌నగర్‌లో గల జీవీఎంసీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ లొడగల అప్పారావు కొబ్బరి నూనె బాటిల్స్ అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారానికి చెందిన పాసి అప్పలనాయుడు బుధవారం సాయంత్రం నిడిగట్టు నుంచి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఓ ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అప్పలనాయుడు కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.

మరోచోట పగిలిన పైప్‌లైన్

- వేలాది లీటర్ల తాగునీరు వృథా
- నిత్యం ఏదోచోట ఇదే దుస్థితి
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని జీవీఎంసీ అధికారులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధి చిట్టివలసలో గురువారం మరోచోట తాగునీటి పైప్‌లైన్ పగిలిపోయింది. కొండపేట గోస్తనీ నది వద్ద పంప్ హౌస్ నుంచి భీమిలి పట్టణ ప్రజలకు సరఫరా అయ్యే ఈ పైప్‌లైన్ చావుల మదుం రోడ్డులో పగిలిపోవడంతో ఈ రహదారి చెరువుగా మారిపోయింది. దీంతో శివాలయం వద్ద పైపుల నుంచి నీరు ఫౌంటెయిన్‌లా ఎగజిమ్మింది. గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డు కూడా చెరువులా మారిపోయింది. యథావిధిగా జీవీఎంసీ సిబ్బంది పగిలిపోయిన పైప్‌లైన్‌కు



చిట్టివలస హైస్కూల్ వద్ద పగిలిన పైప్‌లైన్



చిట్టివలస శివాలయం వద్ద వృథాగా పోతున్న నీరు



చావుల మదుం రోడ్డులో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మరమ్మతులు చేయడానికి గురువారం సాయంత్రం నుంచి ఉపక్రమించారు. దీంతో శుక్రవారం భీమిలి పట్టణానికి తాగునీటి సరఫరా జరగకపోవచ్చని అంటున్నారు. తరచూ పగిలిన చోటే పైప్‌లైన్లు పగిలిపోయి వేలాది లీటర్ల తాగునీరు నేలపాలవుతున్నా ప్రత్యామ్నాయ చర్యలకు జీవీఎంసీ ప్రయత్నించడం



చెరువులా చావుల మదుం రోడ్డు

లేదు. గతంలో వేసిన రీ ఇన్ ఫోర్స్‌డ్ గ్లాస్ పైప్‌లైన్ చుట్టూ ఇసుక వేయకపోవడంతోనే నీటి సరఫరా సమయంలో ఒత్తిడి కారణంగా రాళ్లు తగిలి పైపులైను పగిలిపోతోంది. వారంలో అయిదు రోజులు చిట్టివలస నుంచి భీమిలి వరకు సుమారు 20 ప్రదేశాల్లో ఎక్కడో ఒకచోట పైప్‌లైన్ పగిలిపోతుండడంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందిగా ఉంటుంది.

రంగు మారిన కుళాయి నీరు

రెండు రోజులుగా చిట్టివలస, తగరపువలస ప్రాంతాల్లో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు బురదగా ఉండడంతోపాటు ఎర్రటి రంగులో వస్తున్నాయని మహిళలు అంటున్నారు. గోస్తనీనదిలో ఊటబావుల వద్ద నీరు సేకరించిన ప్రదేశంలోనే ఎర్రగా ఉంటుందని అంటున్నారు. ప్రజల ఆరోగ్యం రీత్యా సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

జ్యూట్ కార్మికుల బకాయిలపై చర్చలు వాయిదా



జాయింట్ లేబర్ కమిషనర్‌తో సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్ కార్మికుల బకాయిల విషయంలో నగరంలోని జాయింట్ లేబర్ కమిషనర్ సమక్షంలో గురువారం కార్మిక సంఘాలు, మిల్లు యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు మే 2కు వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా జూమ్ మీటింగ్ ద్వారా మిల్లు యజమాని బజోరియా జాయింట్ లేబర్ కమిషనర్ రామారావుతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంతమంది కార్మికులకు? ఎంత బకాయిలు చెల్లించారు? అప్రెంటీస్‌లకు చెల్లించాల్సిన బకాయిలు ఎంత? పీఎఫ్ బకాయిల జాబితా ఇవ్వాలని జేసీఎల్ అడిగారు. కార్మికులకు బకాయిల చెల్లింపులో భాగంగా పాస్ పుస్తకాలలో తేడాలు కనిపిస్తున్నాయన్నారు. ఈ జాబితా కూడా ఇవ్వాలని అడగ్గా రెండు రోజుల్లో ఇవ్వనున్నట్టు యజమాని తెలిపారు. తనకు ఆరోగ్యం బాగా లేక సమావేశానికి హాజరుకాలేదని బజోరియా వివరణ ఇచ్చారు. ఫిక్సిడ్ డిపాజిట్లు, కార్మికుల బకాయిల సమస్య పరిష్కరించకపోతే షోకాజ్ నోటీస్ పంపిస్తానని జేసీఎల్ హెచ్చరించారు. కార్మిక సంఘాల ప్రతినిధులు చిల్ల గణేష్‌రెడ్డి, నరవ రామారావు, అల్లు బాబూరావు, బోర రామారావు, చిల్ల ఆదినారాయణరెడ్డి, తమ్మిన కూర్మారావు, సరగడ ఈశ్వరరావు, మునకాల ఆదినారాయణ రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, చిలకా నరసింగరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పీఎం పాలెం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ బక్కన్నపాలెం ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ ఆపరేషన్ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.శ్రీనివాసరావు తెలిపారు. తులసీనగర్, అశోక్ నగర్, ఎస్సీ ఎస్టీ కాలనీ లే అవుట్, ఆర్‌హెచ్ కాలనీ, ముస్లిం కాలనీ, మెయిన్ రోడ్డు, ఎస్‌బీఐ నుంచి చేపల మార్కెట్ వరకూ గల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని ఆయన తెలిపారు.

రేపు అంతరాయం

కొమ్మాది: వివేకానందనగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఎమ్.రాజేష్ తెలిపారు. దీనివల్ల వివేకానందనగర్, సిరిగుడినగర్, పెట్రోల్ బంక్ వెనుకాల నివాసాలు, దసపల్లా లే అవుట్, లలితనగర్, తాటిచెట్లపాలెం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

జగనన్న మళ్లీ వస్తేనే సంక్షేమ పథకాలు

మధురవాడ: సంక్షేమ పథకాలు, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డు మారికవలస – తిమ్మాపురం రోడ్డులోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ పరదేశిపాలెం – 2 కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం అందించే పథకాల ద్వారా ప్రజలకు జరిగిన మేలు పత్రాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ కల్లబొల్లి కబుర్లు, తప్పుడు మాటలు నమ్మి ఎవ్వరూ మోసపోవద్దన్నారు. ఒకప్పుడు ఏ సమస్య వచ్చినా నాయకులు, అధికారుల దగ్గరకి వెళ్లాల్సి వచ్చేదని... ఇప్పుడు అధికారులు, నాయకులే ఇంటింటికీ వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. పింఛన్, రేషన్ వంటివి ప్రతి ఇంటికీ అందుతున్నాయని, అంతా ఆనందంగా ఉన్నామని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఇక్కడ తాగునీటి సమస్య, లో ఓల్టేజీ, శానిటేషన్, చిల్లర దొంగతనాలు, రోడ్డు, కమ్యూనిటీ హాలు నిర్మాణం తదితర



మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో రూ.10 లక్షలతో కనెక్టివిటీ రోడ్డు నిర్మిస్తామని, భద్రత పెంచేందుకు చర్యలు చేపట్టాలని పీఎం పాలెం పోలీసు ఇన్‌స్పెక్టర్ వై.రామకృష్ణను ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జెడ్పీ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఆర్‌ఐ మల్లేశ్వరరావు, నాయకులు జీఎస్ రెడ్డి, రమణమ్మ, ముచ్చు రామారావు, వంకర అప్పారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

భీమునిపట్నం: భీమిలి జోన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో సమస్యలు గుర్తించి, వాటిని స్పందనలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లోని బూత్ కమిటీలు మరింత పటిష్టంగా పని చేసే విధంగా చూస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీగా ఓట్లు సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షురాలు కంటుభుక్త సునీత, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ దేవమ్మ ఉత్సవాలు



పూజలందుకున్న లక్ష్మీ దేవమ్మ



లక్ష్మీ దేవమ్మకి పూజలు చేస్తున్న కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధిలోని స్వతంత్రనగర్ లక్ష్మీ అమ్మవారి ఉత్సవాలు, 7వ వార్షికోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు అర్చకులు కలశ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా 5, 7 వార్డుల కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వాసుపిల్లి బండియ్య, కార్యదర్శి బాలు పాత్రో తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూలఖండ గౌరి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు మధురవాడ, గణేష్‌నగర్, బొట్టవానిపాలెం పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో తిరుమల విద్యార్థుల ముందంజ

తగరపువలస: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో భీమిలి మండలం తాళ్లవలస క్యాంపస్‌కు చెందిన తమ విద్యార్థులు ముందంజలో నిలిచారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో 1294 మంది పరీక్షకు హాజరుకాగా 1284 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో పి.హరిత, జి.రవీంద్రస్వామి, ఎల్.గోపాలంకృష్ణ, వి.గుణశేఖర్, బి.జగన్, కె.జశ్విత్, ఎం.సాయిస్ఫూర్తి 465 వంతున మార్కులు సాధించారన్నారు. 464 మార్కులు 26 మంది విద్యార్థులు సాధించగా 460కు పైగా మార్కులు 153 మంది సాధించారన్నారు. ఫైనల్ ఇయర్ ఎంపీసీలో 944 మంది పరీక్షకు హాజరుకాగా 926 మంది ఉత్తీర్ణులై 98 శాతం ఉతీర్ణత నమోదు చేశారన్నారు. కె.శశిప్రియ 987 మార్కులు, 986 మార్కులు ఏడుగురు సాధించారన్నారు. జూనియర్ బైపీసీలో 106 మంది పరీక్షకు హాజరుకాగా 99 మంది ఉత్తీర్ణులై 93 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వీరిలో పి.తనూజ, ఎం.మోనిక, వై.మురళి 440 మార్కులకు 435 సాధించారన్నారు.

434కుపైగా మార్కులు అయిదుగురు, 433 మార్కులు ఎనిమిది మంది సాధించారన్నారు. సీనియర్ బైపీసీలో 119 మందికి 119 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో బి.చిన్మయి 987, వి.వేణుమాధవి 986, నలుగురు 984 చొప్పున, 980కు పైగా మార్కులు ఆరుగురు సాధించారన్నారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్లు ఇ.మృత్యుంజయ రావు, కె.ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబుతో కలిసి విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో కేథరిన్ విద్యార్థుల హవా



మోహన సాయిలక్ష్మి

తగరపువలస: ఇంటర్మీడియట్ ఫలితాల్లో భీమిలి కేథరిన్ జూనియర్ కళాశాల విద్యార్థులు హవా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో గేదెల మోహన సాయిలక్ష్మి 470కి 455 మార్కులు సాధించగా, చప్పా రేవతి 453, బట్టు నవ్యదీక్షిత 447, ఆర్.సుప్రియ 431, టి.అభిషేక్ 428, కంటుభుక్త ధనలక్ష్మి 425, గంటా రుత్విక సాయి 410 మార్కులు సాధించారు. బైపీసీలో ఆర్.గుణశ్రీ ప్రవలిక 417 సాధించారు. ఫైనల్ ఇయర్ ఎంపీసీలో డి.కిరణ్మయి మేఘన 972, జి.హారిక 951, కె.మౌనిక 936, బి.శిరీష 922 సాధించారు. నామమాత్రపు ఫీజులతో కార్పొరేట్ తరహాలో ఐఐటీ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్‌లో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్టు కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి, ప్రిన్సిపాల్ కె.కె.నాయుడు తెలిపారు.

గ్రామాల్లో సౌకర్యాల కల్పనకు కృషి

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : గ్రామాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో అడపా లవరాజు, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సర్పంచ్‌లు, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ముందుగానే ఆయా ప్రాంతాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. కుటుంబ డాక్టర్ విధానం వల్ల స్థానికంగానే 13 రకాల వ్యాధులకు చికిత్సతోపాటు, 105 రకాల మందులు ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. అన్ని శ్మశాన వాటికల్లో షెడ్లు నిర్మించి, మౌలిక సౌకర్యాలు కల్పించడానికి నిధులు అందిస్తామని చెప్పారు. అవసరమైనచోట కొత్త రోడ్ల నిర్మాణంతోపాటు పాడైనవాటికి మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బోని, శిర్లపాలెం గ్రామాల్లో ఇనాం భూముల సర్వే పూర్తి అయిందని, వారికి పట్టాలు అందజేస్తామని తెలిపారు. ముచ్చర్లలో సర్వే చేయాల్సి ఉందని చెప్పారు. కాలనీ లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలని సూచించారు. ముకుందపురం, తర్లువాడ, గండిగుండం సర్పంచ్‌లు, గంగరాజు, బీఆర్‌బీ నాయుడు, గండ్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు మాట్లాడుతూ కోళ్ల ఫారాల వ్యర్థాలు, చికెన్ సెంటర్లలోని వ్యర్థాలు విచ్చలవిడిగా పారేస్తున్నారని, దాంతో కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని, అలాంటి వారిపై చర్యలు తసుకోవాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సమావేశంలో ఈవోపీఆర్డీ ఆంజనేయులు, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, సర్పంచ్‌లు కర్రి దేవి, షిణగం యర్రయ్య, కోన పైడిరాజు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

భీమునిపట్నం: భీమిలి మండలం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించినప్పుడు ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు ఏడాది అవుతున్నా పరిష్కరించకపోవడంపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దంతులూరి వాసురాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 'గడప గడపకు' కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జూన్ 1కి సమస్యలన్నీ పరిష్కరించాలని, జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు కూడా పనుల విషయంలో శ్రద్ధ చూపాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రయోజనకరంగా ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్

మధురవాడ: జగనన్నతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రజలంతా విశ్వసిస్తున్నారని, అందుకే వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, గృహసారథులకు అంతా బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మధురవాడలోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ పరదేశిపాలెం – 2 కాలనీలో గురువారం నిర్వహించిన జగనన్నే మన భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతా జగనన్న సంక్షేమ పథకాలతో చాలా ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జీఎస్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ మితాన సీతారమణి, బోయి సుజాత, ఎస్.కామేష్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో సర్వేలో 1, 2 వార్డు సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్



సత్యనారాయణమెట్టపై సర్వే చేస్తున్న రెండో వార్డు నాయకులు

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష స్పందన

తగరపువలస: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషంగా స్పందన లభిస్తోంది. ఇంటింటా సర్వేలో భాగంగా గృహస్తులు స్వయంగా వచ్చి స్టిక్కర్లు ఇంటికి అంటించుకోవడంతోపాటు సర్వేలో పాల్గొని 82960 82960కు మిస్డ్ కాల్ ఇస్తున్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు తమకు మేలు చేకూరుస్తున్నాయన్నారు. గురువారం భీమిలి జోన్ బాలాజీనగర్‌లో జరిపిన సర్వేలో 1, 2 వార్డు సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రెండో వార్డు సత్యనారాయణపేటలో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, బింగి హరికిరణ్ రెడ్డి, చిల్ల ప్రమీల, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, చేట్ల ఎల్లయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బంగ్లామెట్ట వద్ద జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, తమ్మిన నరసింగరావు, లెంక రమేష్ తదితరులు పాల్గొన్నారు. భీమిలి మండలం తాటితూరులో జరిగిన సర్వేలో దుంపల నాగమణి, శిరిగుడి ఈశ్వరరావు, ఉండబట్ల వెంకట అప్పారావు, సాడి జాంబిరెడ్డి, సింగిడి అప్పలరాజు, గుర్రపు వెంకటరమణ, దుంపల ప్రభాకర్ పాల్గొన్నారు.



తాటితూరు పంచాయతీలో సర్వేలో పాల్గొన్న గృహ సారథులు, కన్వీనర్లు



బంగ్లామెట్టపై సర్వేలో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు



పరదేశిపాలెంలో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మళ్లీ తడిచిపోయిన మొక్కజొన్న



మద్దిలో తడిచిపోయిన మొక్కజొన్న

పద్మనాభం: పొలాల్లో ఎండ బెట్టిన మొక్కజొన్న పంట గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి మళ్లీ తడిచిపోయింది. దీంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కృష్ణాపురం, మద్ది, పద్మనాభం, కురపల్లి, పాండ్రంగి గ్రామాల్లో రబీలో సాగుచేసిన మొక్కజొన్న పక్వానికి రావడంతో కోసి పొలాల్లో ఎండబెట్టారు. ఐదు రోజుల క్రితం కురిసిన వర్షానికి తడిసిపోయాయి. అనంతరం మొక్కజొన్నలు ఎండిపోవడంతో గింజలు ఆడడానికి రైతన్నలు సిద్ధమవుతున్నారు. ఇంతలో గురువారం వర్షం కురవడంతో మళ్లీ కొన్ని రోజులు ఎండబెట్టాల్సి రావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై పోలీసుల ఉక్కుపాదం

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రిబుల్ రైడింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్టు సీఐ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం చిట్టివలస – కొత్తపేటకు చెందిన దువ్వి వినోద్ అనే 20 ఏళ్ల యువకుడు భీమిలి బీచ్ రోడ్డులో ఇద్దరు వ్యక్తులతో నిర్లక్ష్యంగా, జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేస్తూ ఇతరులకు హాని కలిగించేలా వ్యవహరించడంతో కేసు నమోదు చేశారు. ఇకపై రోజూ ట్రిబుల్ రైడింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై పోలీసులు నిఘా ఉంచి కేసులు నమోదు చేయనున్నట్టు ఆయన హెచ్చరించారు.